నేడు లష్కర్‌లో బీఆర్‌ఎస్ నేతల సమావేశం

సికింద్రాబాద్: సికింద్రాబాద్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తల సమావేశం ఈనెల 17న నిర్వహించనున్నట్లు సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్ తెలిపారు. సీతాఫల్‌మండిలోని మల్టీపర్పస్ ఫంక్షన్‌హాలులో ఉదయం 11 గంటలను నిర్వహించే సమావేశానికి కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, తెలంగాణ ఉద్యమకారులు, బీఆర్‌ఎస్ అనుబంధ సంఘాల ప్రతినిధులు హాజరుకావాలని ఎమ్మెల్యే కోరారు. బీఆర్‌ఎస్ సిల్వర్ జూబ్లి వేడుకలను విజయవంతం చేయడం కోసం పార్టీ శ్రేణులను అప్రమత్తం చేయడంతోపాటు పార్టీని మరింత బలోపేతం చేయడం కోసం సమావేశంలో కార్యాచరణ రూపొందిస్తామని పద్మారావుగౌడ్ తెలిపారు.

కరెన్సీ నోట్ల అలంకరణలో బాలాంజనేయస్వామి



చిలకలగూడ: చిలకలగూడ సాయిబాబా సమేత బాలాంజనేయస్వామి ఆలయ 72వ జయంతి వార్షిక వేడుకలు భక్తిశ్రద్ధలతో ముగిసాయి. ఉత్సవాల చివరి రోజైన బుధవారం స్వామివారు ధన అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మేళతాళాలు, బాజా భజంత్రీలు, వేదపండితులు మంత్రోచ్చారణ మధ్య సింధూర అలంకరణ, నిజాభిషేకం, సుప్రభాత సేవ, సామూహిక విష్ణుసహస్రనామ పారాయణం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఫౌండర్ ట్రస్టీ నాగులూరి సాయిబాబా ప్రత్యేక పూజలు, చేపట్టారు.

హరియాణా గవర్నర్‌కు ఆహ్వానం



సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్ మధురానగర్‌లోని బంగారు మైసమ్మ దేవాలయ వార్షికోత్సవ వేడుకలు ఈనెల 23న నిర్వహించనున్నారు. వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరుకావాలని కోరుతూ ఆలయ చైర్మన్ గుర్రం పవన్‌కుమార్‌గౌడ్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి హర్యాణా గవర్నర్ బండారు దత్తాత్రేయకు ఆహ్వానపత్రాన్ని అందించారు.

చలివేంద్రం ఏర్పాటు



లాలాపేట: గురు విశ్వస్ఫూర్తి, ధ్యానమనో ప్రస్థానం ఆధ్వర్యంలో తార్నాకలోని ఆర్టీసీ హాస్పిటల్ సమీపంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. బుధవారం ఆర్టీసీ హాస్పిటల్ విశ్రాంత డాక్టర్ విమలా ప్రారంభించారు. మానవ సేవే మాధవ సేవ అనే సిద్ధాంతంతో తామంతా స్వచ్ఛంగా ఈలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కె. సందీప్, రంజిత్‌కుమార్, ఉషా, నవీన్ కుమార్, కె. సునీత్, పద్మావతి,వి ప్రతాప్‌కుమార్, టి శ్రీనివాస్ తదితరులున్నారు.

ఎమ్మెల్సీకి అభినందనలు తెలిపిన కార్పొరేటర్



బౌద్ధనగర్: ఎమ్మెల్సీగా దాసోజు శ్రవణ్ బుధవారం ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా అసెంబ్లీ కౌన్సిల్ హాలులో బౌద్ధనగర్ కార్పొరేటర్ కంది శైలజ ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

నూతన ఎమ్మెల్సీకి పలువురి శుభాకాంక్షలు


లాలాపేట: తెలంగాణ శాసన మండలిలో బుధవారం జరిగిన దాసోజు శ్రావణ్ ఎమ్మెల్సీ ప్రమాణ స్వీకారోత్సవానికి తార్నాక డివిజన్ నుంచి బీఆర్‌ఎస్ నాయకులు అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ యువజన విభాగం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు ఆలకుంట హరి ఆధ్వర్యంలో పలువురు నూతన ఎమ్మెల్సీ దాసోజు శ్రావణ్‌ను కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో పురుగుల ప్రశాంత్, దూగుంట్ల నరేష్, వీరేష్ తదితరులున్నారు.

ఒకే కాలనీ...56 పార్కులు

సనత్‌నగర్ ఎస్‌ఆర్‌టీ కాలనీ ప్రత్యేకత



ఎస్‌ఆర్‌టీ కాలనీ ఈ-సేవా వెనుక పార్కు



సనత్‌నగర్ ఇండస్ట్రియల్ పార్కు



నవ వనాల పార్కు అందాలు

సనత్‌నగర్: నగరంలో రోజురోజుకు కాలుష్య ప్రమాణాలు పెరుగుతున్న దృష్ట్యా పరిస్థితి ఆందోళనకరంగా మారుతుండగా ఆ కాలనీవాసులు మాత్రం కాలుష్యానికి దూరంగా ఉండేలా ఏడు దశాబ్దాల క్రితమే పచ్చదనానికి పచ్చజెండా ఊపారు. ఒకటి కాదు...రెండు కాదు...ఏకంగా 56 ఉద్యానవనాలు ఆ కాలనీ సొంతం. ఏ రోడ్డు కెళ్ళినా పార్కులు దర్శనమిస్తాయి. గజం జాగ కనిపిస్తే కాంక్రీట్‌మయంగా మార్చే ప్రస్తుత తరుణంలో 56 పార్కు స్థలాలను కేటాయించడం ఒక వంతైతే... వాటిని కబ్జా కాకుండా కాలనీవాసులంతా సమష్టిగా కాపాడుకోవడం మరో వంతు. కార్మికగడ్డగా పేరొందిన సనత్‌నగర్ ఎస్‌ఆర్‌టీ కాలనీకి వెళితే ఆయా పార్కుల అందాలను ఆస్వాదించవచ్చు. ఎస్‌ఆర్‌టీ కాలనీవాసులే కాకుండా పక్క కాలనీలైనా జెక్‌కాలనీ, రాజరాజేశ్వరీనగర్, తులసీనగర్, సౌభాగ్యనగర్, నాగరాజేశ్వరీనగర్, అల్లావుద్దీన్‌కోఠి, సుభాష్‌నగర్ తదితర ప్రాంతాలకు చెందిన ప్రజలు సైతం ఆయా పార్కులకు వచ్చి వాకింగ్ చేస్తుంటారు. ఆరోగ్యానికి వెన్నుదన్నుగా నిలుస్తోన్న ఇక్కడి పార్కుల అభివృద్ధి కూడా కొనసాగిస్తూ వస్తున్నారు. సగం వరకు ఇప్పటికే పూర్తిస్థాయిలో అభివృద్ధి చెంది ప్రజలకు అందుబాటులోకి రాగా...మరికొన్ని క్రీడామైదానాలుగా వినియోగిస్తున్నారు. వాటికి నలువైపులా సైతం పచ్చదనాన్ని పెంపొందింపజేస్తున్నారు. ఇంకొన్ని అభివద్ధి దశలో ఉన్నాయి.

సనత్‌నగర్ పారిశ్రామికవాడ సాక్షిగా...

స్వాతంత్ర్యానంతరం తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ దేశాన్ని పాలిస్తున్న సమయంలో అప్పటి నిజామ్ పరిపాలనలో ఉన్న హైదరాబాద్ సంస్థానాన్ని 1948లో విలీనం చేసిన విషయం తెలిసిందే. విలీనం అనంతరం సనత్‌నగర్ ప్రాంతంలో అల్లావుద్దీన్ కేంద్ర ప్రభుత్వం నుంచి 408 ఎకరాల భూమిని అప్పటి ప్రప్రథమ రాష్ట్రపతి ద్వారా తన పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. తదనంతరం కేంద్ర కార్మిక సంస్థ ఇక్కడి దాదాపు 150 ఎకరాల్లో చిన్నతరహా పరిశ్రమలు నిర్మించుకోవడానికి ఔత్సాహిక పారిశ్రామికవేత్తల కోసం అల్లావుద్దీన్ నుంచి భూమిని సేకరించింది. అలా సేకరించినదే సనత్‌నగర్ పారిశ్రామికవాడగా నామకరణం జరిగింది. 'సనత్' అంటే పరిశ్రమగా పేర్కొంటారు. అందుకే మొట్టమొదటి పారిశ్రామికవాడ కావడంతో సనత్‌నగర్‌గా ఈ ప్రాంతం పేరు చిరస్థాయిగా నిలిచిపోయింది. మొట్టమొదటి కార్మిక శాఖ మంత్రి చేతుల మీదుగా సనత్‌నగర్ పారిశ్రామికవాడ ప్రారంభమైంది. అదే పారిశ్రామికవాడ ఎదురుగా దాదాపు 100 ఎకరాల విస్తీర్ణంలో ఆనాటి కార్మికుల ఆవాసం కోసం ఏర్పాటుచేసినదే నేటి సనత్‌నగర్ ఎస్‌ఆర్‌టీ కాలనీ. ఎస్‌ఆర్‌టీ (సింగిల్ రూమ్ టెనెంట్స్) పేరిట 1500 క్వార్టర్స్ ఇళ్ళ నిర్మాణం జరిపారు. ఆరు వేల జనాభా ఉన్న ఆ కాలనీలో పార్కుల కోసం 56 ఖాళీ ప్రదేశాలను విడిచిపెట్టారు. కాలక్రమంలో వాటిని కాపాడుకుంటూ అభివద్ధిపరుచుకుంటూ వస్తున్నారు. ఒక్కో పార్కు 1500 గజాల నుంచి మొదలుకొని ఎకరాల వరకు విస్తరించి ఉన్నాయి.



నెహ్రూ పార్కు

చెట్లు, పూలమొక్కలతో ఆహ్లాదంగా...

ఆయా పార్కుల్లో అభివృద్ధి పనులు కొనసాగుతుండడంతో చెట్లు, పూలమొక్కలతో కాలనీవాసులకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. హరితవనం పార్కు, మార్కెట్ ఉద్యానవనం, భగత్‌సింగ్ గ్రౌండ్, వినాయక గ్రౌండ్, బాస్కెట్‌బాల్ మైదానం, నవ వనాల పార్కు, ఇండస్ట్రియల్ పార్కు, నెహ్రూ పార్కు, ఎస్‌ఆర్‌టీ–80, ఎస్‌ఆర్‌టీ–87, ఎస్‌ఆర్‌టీ–495 తదితర పార్కులు ప్రధానమైనవిగా నిలుస్తున్నాయి. క్రీడా స్థలాలను మినహాయిస్తే సుమారు 30 వరకు ఉద్యానవనాలు చెట్లు, పూల మొఇక్కలు, పచ్చికతో ఆహ్లాదంగా కనిపిస్తున్నాయి. ఒక్కో ఉద్యానవనంలో 300 పైచిలుకు వృక్షాలు ఉన్నాయి. ఎక్కడికక్కడ స్థానిక కమిటీలను ఏర్పాటుచేసి వాటి పరిరక్షణ, అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నారు. ఉద్యానవన సంక్షేమ సంఘం, వినాయక సంక్షేమ సంఘం, భగత్‌సింగ్ ఉత్సవ కమిటీ, సనత్‌నగర్‌యువజన సంక్షేమ సంఘం వంటి వాటిని ఏర్పాటుచేసుకున్న కాలనీవాసులు ఈ ఉద్యానవనాలను ఆక్రమణదారుల పాలుకాకుండా కాపాడుకుంటున్నారు.



వినాయక గ్రౌండ్

సకాలంలో మెరుగైన వైద్యం అందించాలి



సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌ఓసీ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: ఆరోగ్య సమ్యలు వచ్చినపుడు సకాలంలో మెరుగైన వైద్యం అందించాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ కోరారు. వెస్ట్ మారేడ్‌పల్లిలోని తన కార్యాలయంలో బుధవారం ఇద్దరు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన ఒక లక్షా 75 వేల రూపాయల ఆర్థిక సహాయం మంజూరు పత్రాలను లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అరుణగౌడ్, నాయకులు శ్రీహరి, ఆరీఫ్ జనార్దన్, నర్సింగరావు, విఠల్, శివ కుమార్, చందు, రాజు తదితరులు పాల్గొన్నారు.

దళితరత్న అవార్డు గ్రహీతలకు సత్కారం



సనత్‌నగర్: దళితరత్న అవార్డు గ్రహీతలను సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అభినందించారు. ఈ నెల 14వ తేదీన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా రవీంద్రభారతిలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమంలో బన్సీలాల్‌పేట డివిజన్‌కు చెందిన 9 మంది దళితరత్న అవార్డులను అందుకున్నారు. బుధవారం అవార్డు గ్రహీతలు వెస్ట్‌మారేడ్‌పల్లిలోని కార్యాలయంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.

'యువ వికాసం'@ 2,023

త్వరలో లబ్ధిదారుల ఎంపికకు కసరత్తు

బంజారాహిల్స్: నిరుపేద నిరుద్యోగులకు ఆర్థిక సాయం అందించి ఉపాధి పొందేలా తెలంగాణ ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకానికి నిరుద్యోగులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ, క్రిస్టియన్ మైనారీల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ప్రారంభంలో ఆన్‌లైన్‌లో మాత్రమే మీ–సేవా కేంద్రాల్లో ఏప్రిల్ 5వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించారు. మీ–సేవా కేంద్రాల్లో సాంకేతిక సమస్యలు దరఖాస్తుదారులకు తీవ్ర ఇబ్బందులు కలిగించడంతో పునరాలోచన చేసిన ప్రభుత్వం ఈ నెల 14 వరకు గడువు పొడిగించి ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేలా అవకాశం కల్పించింది.

- ఖైరతాబాద్ నియోజకవర్గం పరిధిలోని డివిజన్ వార్డు కార్యాలయాల్లో ఈ మేరకు ప్రత్యేక కేంద్రాలు తెరిచి సిబ్బందిని నియమించి దరఖాస్తులు స్వీకరించారు. నియోజకవర్గ పరిధిలో 2,023 మంది దరఖాస్తు చేసుకున్నారు. చాలామంది దుకాణాల ఏర్పాటుకు మొగ్గుచూపారు. రూ. 4 లక్షల రుణాలకు అధికంగా దరఖాస్తులు వచ్చాయి.

కమిటీ పరిశీలన...

రాజీవ్ యువ వికాసానికి సంబంధించి దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులను త్వరలో ఎంపిక చేయనున్నారు. వార్డు స్థాయిలో ఇందుకు సంబంధించి కమిటీ ఏర్పాటుచేసే దిశలో ప్రభుత్వం యోచిస్తోంది. ఇందులో జీహెచ్‌ఎంసీ అధికారులు, సంబంధిత బ్యాంక్ మేనేజర్లు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, ఈబీసీల ఆర్థిక సంస్థల ప్రతినిధులు కమిటీలో ఉండనున్నారు. ఈ కమిటీ అభ్యర్థుల ధ్రువపత్రాల ప్రామాణికతను, వారి అర్హతను ధ్రువీకరించి ఎంచుకున్న స్వయం ఉపాధి పథకం సాధ్యాసాధ్యాలను అంచనా వేస్తారు. కమిటీ తయారుచేసిన తుది జాబితాను జిల్లా స్థాయి కమిటీకి పంపుతారు.



రాజీవ్ యువ వికాసం దరఖాస్తులను స్వీకరిస్తున్న అధికారులు

- జిల్లా స్థాయిలో కూడా సంబంధిత శాఖల అధికారులు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు, లీడ్ బ్యాంక్ డిస్ట్రిక్ మేనేజర్ ఉంటారు. ఈ కమిటీ స్వయం ఉపాధి పథకం ఎంపిక చేసిన అనంతరం ఇన్‌చార్జి మంత్రి చేతుల మీదుగా మంజూరు పత్రాలను అందజేయనున్నారు.
- లబ్ధిదారులకు 15 రోజుల వరకు శిక్షణ ఇవ్వనున్నారని అధికారులు వెల్లడించారు.

డివిజన్ వారీగా వచ్చిన దరఖాస్తులివీ...

డివిజన్	దరఖాస్తులు
సోమాజిగూడ	242
ఖైరతాబాద్	523
వెంకటేశ్వరకాలనీ	334
బంజారాహిల్స్	189
జూబ్లీహిల్స్	735


పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

బండ్లగూడ: పారిశుద్ధ్య పనులను క్రమంగా నిర్వహిస్తూ ప్రజలకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర సూచించారు. కార్పొరేషన్ పరిధిలోని 11వ డివిజన్‌లోని దర్గాఖలీజ్‌ఖాన్‌లో, 12వ డివిజన్‌లోని హిమాయత్‌సాగర్‌లో బుధవారం స్వీపింగ్ పనులను, 3వ డివిజన్‌లోని మాధవినగర్ కాలనీలో అండర్ డ్రైనేజీ క్లీనింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పారిశుద్ధ్య కార్మికులు ప్రధాన రహదారులను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలన్నారు. శానిటరీ జవాన్లు మీర్జా టౌఫిక్, మల్లేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ సభను విజయవంతం చేయండి

ఉస్మానియా యూనివర్సిటీ: వరంగల్‌లో ఈ నెల 27న జరగనున్న బీఆర్‌ఎస్ 25 ఏండ్ల రజతోత్సవ మహాసభను విజయవంతం చేయాలని విద్యార్థి విభాగం నేతలు కోరారు. బుధవారం ఆర్ట్స్ కాలేజీలో బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర కార్యదర్శి జంగయ్య మాట్లాడుతూ.. కేసీఆర్ తన పదేళ్ల పాలనలో తెలంగాణను పలు రంగాల్లో అభివృద్ధి చేశారన్నారు. కార్యక్రమంలో వినోద్, నాగరాజు, రమేష్, మల్లేష్, వెంకట్, మురళి, ప్రశాంత్, యుగేందర్, శ్రీకాంత్, విజేందర్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి న్యూసెన్స్ చేసిన వ్యక్తికి జైలు



నిరంజన్

బౌద్ధనగర్: మద్యంతాగి పబ్లిక్ న్యూసెన్స్ చేసిన ఓ యువకుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన వారాసిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. చిలకలగూడలోని మేడిబావి ప్రాంతానికి చెందిన నిరంజన్(20) ప్రైవేటు ఉద్యోగి. ఇటీవల మద్యం సేవించిన ఇతడు మద్యం మత్తులో పబ్లిక్ న్యూసెన్స్ చేశాడు. ఈ మేరకు స్థానికుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న వారాసిగూడ పోలీసులు నిరంజన్‌ను బుధవారం సికింద్రాబాద్ సివిల్ కోర్టులో మెజిస్ట్రేట్ ముందు ప్రవేశపెట్టగా మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

రైలు ఢీకొని మహిళ మృతి

సికింద్రాబాద్: వేగంగా వచ్చిన రైలు ఢీ కొనడంతో గుర్తు తెలియని మహిళ మృతి చెందింది. ఈ బుధవారం సికింద్రాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. జీఆర్‌పీ ఎస్ఐ ఎంఏ మాజిద్ కథనం ప్రకారం... మేడ్చల్ రైల్వేస్టేషన్ యార్డు సమీపంలోని ట్రాక్ వద్దకు వచ్చిన ఒక మహిళ (45)ను వేగంగా వచ్చిన నాగావళి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో మహిళకు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన రైల్వే పోలీసులు బాధితురాలిని చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రికి చేరుకునే సమయానికే ఆమె మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతురాలి వద్ద వివరాలు లభించలేదు.

ఆలయ ప్రాంగణంలో అల్లరి మూకలు

- ముత్యాలమ్మ దేవాలయం వద్ద పరిస్థితులు అధ్వానం
- మందుబాబులకు అడ్డాగా ఆలయ ప్రాంగణం

సికింద్రాబాద్: మెట్టుగూడ డివిజన్ ఆలుగడ్డబావి సమీపంలోని రెండు కట్టల మధ్యన గల శ్రీ ముత్యాలమ్మ దేవాలయ పరిసర ప్రాంతాలు అస్తవ్యస్తంగా మారాయి. ఈ ప్రాంతం అల్లరి మూకలకు కేంద్రంగా మారింది. ఒకవైపు ఆలయం వద్ద పారిశుద్ధ్యం పనులు లేక చెత్తకుప్పలు పేరుకుపోతున్నాయి. మరోవైపు పోలీసు గస్తీ లేకపోవడంతో రాత్రి సమయాల్లో మందు బాబుల ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. సీతాఫల్‌మండి, మెట్టుగూడ, లాలాగూడ ప్రాంతాల నుండి అనేకమంది భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసేందుకు వస్తుంటారు. జనవాసాలకు దూరంగా చుట్టూ చెట్లు కలిగిన ప్రాంతంలో దేవాలయం ఉండడంతో ఇక్కడ పలువురు శుభకార్యాలు, విందులు కూడా చేసుకుంటారు.

పేరుకుపోతున్న చెత్త కుప్పలు

వందలాది మంది రాకపోకలు సాగించే ఈ దేవాలయం వద్ద పారిశుద్ధ్యం పనులు నిర్వహించేందుకు జీహెచ్‌ఎంసీ యంత్రాంగం కన్నెత్తి అయినా చూడడం లేదు. పారిశుద్ధ్యం పనులు లేకపోవడంతో ఆలయ పరిసర ప్రాంతాలు అస్తవ్యస్తంగా మారుతున్నాయి.



ఆలుగడ్డబావి రెండు కట్టల మధ్యగల శ్రీముత్యాలమ్మ దేవాలయం

మందుబాబులకు అడ్డాగా...

దేవాలయానికి కొంతదూరంలో మద్యం దుకాణం ఉంది. ఇక్కడ మద్యం కొనుగోలు చేస్తున్న పలువురు ఆలయం వద్ద కూర్చొని మద్యం తాగుతున్నారు. రాత్రి వేళల్లో కూడా కొందరు ఇదే పనిచేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, చిలకలగూడ పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

బాధితులకు న్యాయం చేస్తాం: ఎమ్మెల్యే శ్రీ గణేష్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీ గణేష్

కంటోన్మెంట్: ఎలివేటర్ కారిడార్ నిర్మాణంలో భాగంగా చేపట్టనున్న విస్తరణలో స్థలాలు కోల్పోతున్న మసీదు దర్గాలకు ప్రత్యామ్నాయ స్థలాలు ఇప్పించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే శ్రీ గణేష్ అన్నారు. రోడ్డు విస్తరణలో భాగంగా స్థలాలు కోల్పోనున్న మసీదు దర్గాల ప్రతినిధులతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం వల్ల కంటోన్మెంట్లో సమస్య చాలా వరకు పరిష్కారం అవుతుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన 10 నెలల్లోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎలివేటెడ్ కారిడార్ కు రక్షణ భూములు ఇచ్చేలా కేంద్రాన్ని ఒప్పించినట్లు తెలిపారు. రక్షణ భూములను వదిలించుకొని నిర్మాణం పనులకు శంకుస్థాపన చేశామన్నారు. అయితే కారిడార్ నిర్మాణం కోసము ప్రైవేట్ ఆస్తులతో పాటు పలు ప్రార్థనా మందిరాల స్థలాలు సేకరించాల్సి వస్తుందన్నారు. కొంతమేరకు నష్టం వాటిల్లుతున్నప్పటికీ అభివృద్ధి అనివార్యం అన్నారు. సమావేశంలో ముస్లిం బోర్డ్ ప్రెసిడెంట్ అజ్మత్ హుస్సేన్ సిరాజ్ షకీబ్ కంటోన్మెంట్ బోర్డ్ మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ ముప్పిడి మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల ముగ్గురు యువతుల అదృశ్యం



అదృశ్యమైన యువతులు (ఫైల్)

చిలకలగూడ : చిలకలగూడ ఠాణా పరిధిలో వేర్వేరు చోట్ల ముగ్గురు యువతులు అదృశ్యమయ్యారు. పోలీసులు తెలిపిన మేరకు.. సీతాఫల్‌మండి టీఆర్‌టీ క్వార్టర్స్‌కు చెందిన గొల్ల రేణు (20) నారాయణగూడలోని రెడ్డి కాలేజీలో బీఎస్సీ సెకెండియర్ చదువుతోంది. ఈనెల 15న ఆటోలో కాలేజీకి వెళ్లి తిరిగి ఇంటికి చేరలేదు. సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తోంది. పలు ప్రాంతాల్లో వాకబు చేసిన ఫలితం లేకపోవడంతో తల్లి లలిత పోలీసులను ఆశ్రయించింది.

ఎంబీఏ విద్యార్థిని...

మెట్టుగూడకు చెందిన రక్షిత (22) చదువుతోంది. ఈనెల 15వ తేదిన సమీపంలో ఉన్న ఆలయానికి వెళుతున్నానని చెప్పి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి చేరలేదు. టెంపుల్ వద్ద ఓ యువకుడితో మాట్లాడుతుండగా చూశామని స్థానికులు సమాచారం ఇచ్చారు. సన్నిహితులు, బంధుమిత్రులను వాకబు చేసి పలు ప్రాంతాల్లో గాలించారు. తండ్రి రాము పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పరీక్ష రాయడానికి వెళ్లిన యువతి...

చిలకలగూడ దూద్‌బావి ప్రాంతానికి చెందిన కలివల భాను (20) పద్మారావునగర్ విజ్ఞాన్ డిగ్రీ కాలేజీలో చదువుతోంది. ఈనెల 15న పరీక్ష రాసేందుకు కాలేజీకి చెప్పి బయటకు వెళ్లింది. మధ్యాహ్నం 3.30 గంటలకు కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి స్నేహితులతో షాపింగ్‌కు వెళుతున్నానని చెప్పింది. రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో కాల్ చేయగా స్విచ్ఛాఫ్ వస్తోంది. తల్లి తారాబాయి పోలీసులకు ఆశ్రయించింది. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదుల మేరకు మిస్సింగ్ కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని, సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తున్నామని పోలీసులు తెలిపారు.

నిరుపేద నివాసితుల ఆందోళన

అమీర్‌పేట: సనత్ నగర్ నియోజకవర్గంలోని దాసారాం బస్తీలోని ఖాళీ స్థలంలో అకస్మాత్తుగా నిర్మాణాలు ప్రారంభించడంపై తాత్కాలిక గుడిసెల్లో నివసిస్తున్న నిరుపేద నివాసితులు బుధవారం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏళ్ల తరబడి ఇక్కడే గుడిసెలు ఏర్పాటు చేసుకొని కూలీ పనులు చేసుకుంటూ నివసిస్తున్నామన్నారు. ఇలాంటి పరిస్థితిలో గూడు కోల్పోతే తాము ఎక్కడ నివసించాలని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుపేదల ఆందోళన విషయం తెలుసుకున్న సనత్‌నగర్ కాంగ్రెస్ ఇంచార్జి డాక్టర్ కోట నీలిమ బస్తీని సందర్శించి వారితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. స్థలం విషయమై వాస్తవాలను తెలుసుకొని సరైన నిర్ణయం తీసుకుంటామన్నారు.



స్థానికులతో సమావేశమైన కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కోట నీలిమ

ఖాతాదారుల ప్రయోజనాలకే అధిక ప్రాధాన్యం



రాంగోపాల్‌పేట్: పంజాబ్ నేషనల్ బ్యాంకు ఖాతాదారుల కోసం అదిక ప్రాధాన్యత ఇస్తామని బ్యాంకు చీఫ్ జనరల్ మేనేజర్ సునిల్ కుమార్ చుగ్ అన్నారు. పీఎన్‌బీ ఎంజీ రోడ్డు బ్రాంచ్ కార్యాలయం పునరుద్ధరణ తదనంతరం బుధవారం ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. ఖాతాదరుల సంక్షేమమే తమ ధ్యేయమని వారికి అధునాతన సౌకర్యాలు కల్పించేందుకు ఎప్పటికీ సిద్ధంగా ఉన్నామని ఆయన అన్నారు. కార్యక్రమంలో బ్యాంకు రీజనల్ మేనేజర్, సికింద్రాబాద్ సర్కిల్ హెడ్ సుజిత్‌కుమార్ జా, బ్రాంచ్ మేనేజర్ సీ వివేకానంద తదితరులు పాల్గొన్నారు.